# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **క్రీడారంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.**
3. **తెలంగాణలో మరో 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ ఆరోగ్య కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు.**
4. **పర్యాటకంపై మరింత అవగాహన పెంచేందుకు ఈ రోజు ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

క్రీడారంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో క్రీడా శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న క్రీడా మైదానాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, 35 క్రీడా వికాసకేంద్రాలకు 23 కోట్ల రూపాయలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటు ద్వారా గ్రామీణ యువతకు క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నూతన క్రీడా పాలసీని రూపొందించాలని , 2027లో నిర్వహించనున్న జాతీయ క్రీడలు రాష్ట్రంలో నిర్వహించే లక్ష్యంతో తగిన మౌలిక సదుపాయాలను కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

------------------------

తెలంగాణలో మరో 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ ఆరోగ్య కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్య, ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికీ విడివిడిగా హెల్త్ ప్రొఫైల్ రూపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు రాష్ట్రంలోని 4 కోట్ల

ప్రజల హెల్త్ ప్రొఫైల్స్‌ను డిజిటలీకరణ చేయనున్నామని, ఈ హెల్త్ కార్డుల్లో గత చికిత్స వివరాలు పొందుపరుస్తామని తెలిపారు.

---------------------------

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఒంగోలులోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో గత రాత్రి నిర్వహించిన బధిరుల సంకేత భాషా దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా ఎంపికైన 50 మంది విభిన్న ప్రతిభావంతులకు చెక్కులను ఆయన అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతులను క్రీడల్లో ప్రోత్సహించేలా విశాఖపట్నంలో 200 కోట్ల రూపాయలతో జాతీయ విభిన్న ప్రతిభావంతులక్రీడా కేంద్రం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

---------------------------

తెలంగాణలోని ప్రతి జిల్లాలో నైపుణ్య అభివృద్ధి కళాశాలలను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్‌లో నిర్వహించిన నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, యువతలో వృత్తి నైపుణ్యాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. నిరుద్యోగులకు నైపుణ్య విద్య అందించడానికి ప్రభుత్వం "తెలంగాణ నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని" ఏర్పాటు చేసిందని, ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్టుగా యువతను తీర్చిదిద్దేందుకుగానూ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుస్తున్నామని, ఇందుకు అనుగుణంగా తెలంగాణలోని 65 ఐటీఐలను ఆధునీకరిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

నీటి ప్రాజెక్టుల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణ నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని జలసౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశం గొప్పతనాన్ని చెప్పేది, దేశంలోని నిర్మాణాలు, కట్టడాలే అని అన్నారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు తలెత్తాయని చెప్పారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు లక్షల ఎకరాలకు నీళ్లు, విద్యుత్ ఇస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దీపావళి నుంచి పేద కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేయనున్నట్లు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో నిన్న నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన పింఛన్లు లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. డీఎస్సీ ద్వారా 16 వేల 5 వందల పోస్టులు భర్తీకి నోటిఫికేషన్

ఇచ్చామని, రానున్న ఐదేళ్లలో యువతకు 20 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

పర్యాటకంపై మరింత అవగాహన పెంచేందుకు ఈ రోజు ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి పర్యాటక సంస్థ పిలుపు మేరకు 1980 సంవత్సరం నుండి ప్రతి ఏటా సెప్టెంబర్ 27న ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పర్యాటక రంగాభివృద్ధికి కేంద్రం అనేక చర్యలు చేపడుతోంది. 'పర్యాటకంతో శాంతి' అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

---------------------------

రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వి.సుభాష్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో నిర్వహించిన "పొలం పిలుస్తుంది" కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ, వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేలా రైతులకు అవగహన కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

రామాయణంలోని మానవీయ విలువలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తెలిపారు. విజయనగరం జిల్లా కేంద్రం సమీపంలోని రామనారాయణంలో ఏర్పాటు చేసిన వాల్మీకి రామాయణ పరిశోధన కేంద్రాన్ని నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, శ్రీరాముని జీవితం ఆదర్శంగా, వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. రామాయణంలోని మానవీయ విలువలను భావితరాలకు అందించడానికి ఈ పరిశోధన కేంద్రం ద్వారా కృషిచేయాలని కోరారు.

---------------------------

రాష్ట్రంలో చిరు వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోదని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించిన ప్రభుత్వ రుణాల అవగహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, చేతివృత్తుల కళాకారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.బ్యాంకు అధికారులు ప్రభుత్వాలు అందించే రాయితీ రుణాలపై గ్రామ స్థాయిలోనూ అవగాహన కల్పించాలని సూచించారు. బ్యాంకర్లు అందించే రుణాలపై అవగహన కల్పించేందుకు త్వరలో నూజివీడులో ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే  లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకునేందుకు  తనిఖీలు చేస్తున్నామన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు, టీచర్లు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యంతో  ప్రమాణాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం పేరెంట్– టీచర్స్ సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి వివరించారు.

---------------------------

దేశవ్యాప్తంగా 7 వ  జాతీయ  పోషణ మహోత్సవంలో భాగంగా  ఇప్పటివరకు 9 కోట్ల 68 లక్షల కార్యక్రమాలను నిర్వహించినట్లుగా మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రతీ ఏటా పోషకాహారం ఆవశ్యకత,  రక్తహీనత నివారణ  వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ పలు  కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలలో నిర్వహిస్తోంది. ఈ ఏడాది పోషణ మాసం  కార్యక్రమాలలో ఇప్పటివరకు మహారాష్ట్ర, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అగ్రగామిగా ఉన్నాయని మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది.

---------------------------

పొగాకు వినియోగం వల్ల వచ్చే దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్వహణ పోటీలో ఆంధ్రప్రదేశ్‌కు తొలి స్థానం లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం– వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా ఈ ఏడాది మే 20 నుంచి జూన్ 5వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా దేశవ్యాప్తంగా నిర్వహించింది. ఈ క్రమంలో తొలిస్థానంలో ఆంధ్రప్రదేశ్, రెండో స్థానంలో ఒడిశా, మూడో స్థానంలో డామన్ అండ్ డయ్యు నిలిచాయి. ఢిల్లీలో నిర్వహించిన  కార్యక్రమంలో రాష్ట్ర  పొగాకు నియంత్రణ కార్యక్రమ సమన్వయకర్త ఇ.ప్రశాంత్, కేంద్ర ఆరోగ్య శాఖ ముఖ్య అధికారి డాక్టర్ డీడీజీ స్వస్తిచరణ్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు

======================